సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 21 । జూలై । 2024



గోదావరి..ఉరకలు

భద్రాచలంలో గోదావరి ప్రవాహం ఉరకలు వేస్తోంది. వరద పోటెత్తడంతో రాత్రి 11 గంటలకు 35.9 అడుగులకు చేరింది. 8లో



నేడు దమ్మక్క స్మృతి యాత్ర

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి అపర భక్తురాలైన పోకల దమ్మక్క స్మృతియాత్ర ఆదివారం నిర్వహించనున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం 29° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు పెద్దవాగును పరిశీలించనున్న మంత్రి

అశ్వారావుపేట: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఇటీవల వరదతో ప్రాజెక్టుకు గండి పడిన విషయం విదితమే. ఈ నేపథ్యాన ఆదివారం ఉదయం 10 గంటలకు మంత్రి పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి వరద బాధిత కుటుంబాలు, పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతారు.

ఇరిగేషన్ అధికారులపై సస్పెన్షన్ వేటు ?

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టుకు రెండు రోజుల క్రితం భారీగా వరద పోటెత్తగా, మట్టికట్టకు భారీ గండ్లు పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేయగా, ఇప్పటికే ఇరిగేషన్ ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ, ఏఈఈ కేఎస్‌బీ కృష్ణపై చర్యలకు ఆదేశించడంతో శుక్రవారం రాత్రే ఈ ముగ్గురికి సీఈ శ్రీనివాసరెడ్డి మెమోలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్ కావడంతో ఆ ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జిల్లా అధికారులు సిఫార్సు చేసినట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కోర్టులో 'సోలార్ ఎనర్జీ' ప్రారంభం

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ఎనర్జీ యూనిట్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి, న్యాయమూర్తులు కె.సాయిశ్రీ, శివనాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

మన అరుణగిరి..

సండే స్పెషల్

పౌర్ణమి రోజున కాంతులీననున్న క్షేత్రం

- అరుణాచలం తరహాలోనే పూజా విధానం
- గిరి ప్రదక్షిణ, అష్టదిక్పాలకులు, శివలింగాలకు పూజలు
- భస్మాభిషేకాలు, మహా దీపారాధనలు
- భద్రాచలం సమీపంలో చిన్న అరుణాచల ఆలయం



నర్సాపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచల ఆలయం

దుమ్ముగూడెం: పౌర్ణమి వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాల్లో శివనామస్మరణ మార్మోగుతోంది. ముఖ్యంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి వెళ్లి అక్కడ అరుణగిరి చుట్టూ ప్రదక్షణ చేయడానికి భక్తులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ ప్రతీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. అయితే అరుణాచలం (తమిళనాడు) వరకు వెళ్లలేని భక్తులకు ఆ లోటు కొంత మేరకైనా పూడ్చుతోంది దుమ్ముగూడెం మండలం నర్సాపురంలోని చిన్న అరుణాచల దేవాలయం.

అచ్చం అరుణాచలం తరహాలోనే..

శివపార్వతులు అరుణగిరి రూపంలో కొలువై ఉన్నారని భావిస్తూ అరుణాచల క్షేత్రంలో గిరి ప్రదక్షిణకు భక్తులు అధిక ప్రాధాన్యత ఇస్తారు. 14 కిలోమీటర్ల మేర ఉండే ఈ మార్గంలో అష్టదిక్పాలకులు, సూర్య చంద్రులు పూజించిన శివలింగాలతో కూడిన పది ఆలయాలు ఉంటాయి. ఒక్కో ఆలయంలో శివున్ని దర్శించుకుంటూ భక్తులు తన్మయత్వంలో మునిగిపోతారు. ఇక 1008 శివలింగాలతో పాటు అపీతకుచలాంబాదేవి (పార్వతి) ఒకే గర్భగుడిలో కొలువై ఉన్నారు. దీంతో ఆలయాన్నే అరుణగిరిగా భావిస్తూ భక్తులు పౌర్ణమి రోజున ఇక్కడ ప్రదక్షిణలు చేస్తారు. ఆలయం చుట్టూ అష్టదిక్పాలకులతో పాటు సూర్యచంద్రులు పూజించిన శివలింగాలను ప్రతిష్ఠించగా, భక్తులు ప్రదక్షిణ సందర్భంగా ఈ లింగాలకు అభిషేకం చేసుకోవచ్చు.

కృత్తికా దీపం..

అరుణాచలం(తమిళనాడు)లో ప్రతీ ఏడాది కృత్తికా నక్షత్రం రోజున మహాదీపాన్ని వెలిగిస్తారు. అదే తరహాలో చిన్న అరుణాచల క్షేత్రంలోనూ మహాదీపం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీని కోసం 42 అడుగుల ఎత్తయిన శిలతో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కృత్తికా నక్షత్రం రోజున మహాదీపం వెలిగించి, ఆ తర్వాత లక్షదీపార్చన చేస్తారు. పౌర్ణమికి ముందు వచ్చే త్రయోదశి రోజున అరుణాచలం తరహాలో నందీశ్వరుడికి, మహా శివుడికి ఏకకాలంలో హారతి ఇస్తారు. దీంతో పాటు ప్రతీ పౌర్ణమి, సోమవారం రోజుల్లో నాగ, సింహ తదితర మొత్తం 21 రకాల హారతులు అందిస్తారు. దీంతో పాటు పౌర్ణమి రోజున అపీతకుచలాంబ సమేత అరుణాచలస్వామికి కల్యాణం జరిపిస్తుంటారు. అంతేకాక వినాయక చవితికి సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామికి, సుబ్రహ్మణ్య అష్టమి రోజున వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణం నిర్వహిస్తారు. హనుమాన్ జయంతి రోజున సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిపిస్తారు.

భస్మాభిషేకం..

ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయంలో ప్రతీరోజు ఉదయం ప్రాతఃకాల సమయంలో భస్మాభిషేకం నిర్వహిస్తారు. అవే పూజా పద్ధతులను పాటిస్తూ ప్రతీ మాసశివరాత్రి రోజున ఈ ఆలయ ప్రాంగణంలోని 42 శివలింగాలకు భస్మాభిషేకం నిర్వహిస్తున్నారు. ఇక ఆలయ ముఖద్వారం దగ్గర మలేషియాలో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం తరహాలో ఏర్పాటు చేసిన 21 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



శ్రీపాదలింగం

భద్రాచలం – పర్ణశాల మధ్య..

భద్రాచల రాముడిని దర్శించుకునేందుకు నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారిలో చాలా మంది పర్ణశాలకు వెళ్తుంటారు. భద్రాలచం – పర్ణశాల మధ్యన నర్సాపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే చిన్న అరుణాచల క్షేత్రం ఉంది. భద్రాచలం నుంచి 14 కి.మీ., పర్ణశాల నుంచి 21 కి.మీ. దూరంలో ఈ ఆలయం ఉంటుంది. ఇక్కడ నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. సద్గురు రమణ మహర్షి ఆశ్రమ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ద్వాదశ జ్యోతిర్లింగాలు..

శైవ క్షేత్రాల్లో జ్యోతిర్లింగాలుగా ప్రసిద్ధి చెందిన సోమ్‌నాథ్ (గిర్, గుజరాత్), మల్లికార్జున (శ్రీశైలం, ఏపీ), మహాకాళేశ్వర్ (ఉజ్జయిని, మధ్యప్రదేశ్), ఓంకారేశ్వర్ (ఖండ్వా, మధ్యప్రదేశ్), వైద్యనాథ్ (మహారాష్ట్ర), భీమశంకర్ (మహారాష్ట్ర), రామేశ్వరం(తమిళనాడు), నాగేశ్వరం (ద్వారక, గుజరాత్), కాశీ విశ్వనాథ్ (వారణాసి, ఉత్తర్‌ప్రదేశ్), త్రయంబకేశ్వర్ (నాసిక్, మహారాష్ట్ర), కేదార్‌నాథ్ (ఉత్తరాఖండ్), ఘృశ్వేశ్వర్ (ఔరంగాబాద్, మహారాష్ట్ర) శివలింగాలను చిన్న అరుణాచల ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ క్షేత్రానికి వచ్చిన భక్తులు ఒకే చోట ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చు. వీటితో పాటు శ్రీపాద లింగం, శ్రీచక్ర లింగం, పంచముఖ లింగం, పాతాళలింగం తదితర 42 లింగాలను కూడా దర్శించుకునే అవకాశం భక్తులకు కలుగుతుంది.

చర్లలో అత్యధిక వర్షపాతం నమోదు

చర్ల/కొత్తగూడెంటౌన్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా చర్ల మండలంలో 121.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెంలో 69.3, మణుగూరులో 59.9, జూలూరుపాడులో 59.5 మి.మీ. వర్షం కురిసింది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసమైతే తప్ప బయటకు రావొద్దని ఎస్పీ రోహిత్ రాజ్ ఒక ప్రకటనలో సూచించారు. ఆపదలో ఉన్న వారు డయల్ 100 కు ఫోన్ చేయాలన్నారు.



భారీగా నీరు చేరిన తాలిపేరు ప్రాజెక్ట్

లోతట్టు గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతోందని, నది నుంచి 5,89,743 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అత్యవసర సేవలకు 24 గంటలూ పనిచేసేలా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలకు ఫోన్ చేయాలని, కలెక్టరేట్‌లో కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కంట్రోల్‌రూం నంబర్ 08744 – 241950, వాట్సాప్ నంబర్ 9392919743కు మెసేజ్ లేదా వీడియో ద్వారా సమాచారం అందించాలని పేర్కొన్నారు.

రైతుబజార్ పరిశీలన..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం 36వ వార్డులోని రైతుబజార్‌ను కలెక్టర్ పాటిల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లోని సమస్యలను 36వ వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి కలెక్టర్ దృష్టికి తేగా.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, సింగరేణి ఎస్టేట్ అధికారులను ఆయన ఆదేశించారు.



రైతుబజార్ వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాణ్యమైన విద్య అందించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులతో పాటు నాణ్యమైన బోధన అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. శనివారం ఆయన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన తనిఖీల్లో విద్యార్థుల్లో చదువు పరంగా అనేక లోపాలు బహిర్గతమయ్యాయని, అవి పునరావృతం కాకుండా బోధన జరగాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వారికి తప్పనిసరిగా బెడ్‌లు ఉండాలన్నారు. కొందరు విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని, అది సరైంది కాదని అన్నారు. జీసీసీ ద్వారానే గుడ్లు, కూరగాయలు, పండ్లు సరఫరా చేయాలన్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన చేయాలని, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ల్యాబ్‌లు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌లో చేపట్టాల్సిన కోర్సులపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పీఓను హెచ్‌ఎంలు సన్మానించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ ఏసీఎంఓ రమణయ్య ఏటీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ రాహుల్

రేపటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

కొత్తగూడెంఅర్బన్: జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 22 నుంచి 29 వరకు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. తొలిరోజు సోమవారం బోధనోపకరణాల దినోత్సవం, రెండో రోజు మౌలిక భాష, గణిత దినోత్సవం, మూడోరోజు క్రీడా దినోత్సవం, నాలుగో రోజు సాంస్కృతిక దినోత్సవం, ఐదో రోజు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అంకురాల దినోత్సవం, ఆరో రోజు పర్యావరణ క్లబ్స్ దినోత్సవంతో పాటు చివరి రోజు కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్ డే నిర్వహించాలని వివరించారు.

23న పోస్టర్ తయారీ పోటీలు..

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈనెల 23న పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. మహిళా సాధికారత, సమతుల్యతను నిర్ధారించడం, మెరుగైన సమాజం కోసం జనాభా నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం అంశాల్లో ఏదైనా ఒకటి ఎంచుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం ఆనందఖనిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతీ పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలని, ఇక్కడి విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్‌ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

పాఠశాల సమయాల్లో మార్పులు..

పాఠశాలల సమయాల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని హైస్కూళ్లను ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైమరీ పాఠశాలలు మాత్రం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కూడా యాథావిధిగా కొనసాగనున్నాయని, ఈ వేళలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని వివరించారు.

వ్యాధులు ప్రబలకుండా చూస్తాం

- పట్టణంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య చర్యలు
- ఖాళీ స్థలాల్లో మొక్కలు తొలగిస్తాం
- డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు ముమ్మరం
- 'సాక్షి ఫోన్ ఇన్'లో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నివారణకు కృషి చేస్తున్నామని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. జూన్ మొదటి వారం నుంచే పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని చెప్పారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నామని తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన పలు సమస్యలకు ఆయన సమాధానం చెప్పారు. ఇంకేమైనా ఇబ్బందులు ఉంటే త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్య : చెత్త సేకరణ వాహనం వార్డులోకి రావడం లేదు

– గౌస్, గంగాబిషన్ బస్తీ

కమిషనర్ : పట్టణ పరిధిలో అన్ని వార్డుల్లో ఉదయాన్నే చెత్త సేకరణకు ట్రాలీలు వెళ్తున్నాయి. మీ బస్తీకి ట్రాలీ ఎందుకు రావడం లేదనే విషయాన్ని పరిశీలించి, వచ్చేలా చర్య తీసుకుంటాం.

స : పదో వార్డులో డ్రెయినేజీల సమస్య తీవ్రంగా ఉంది

– ప్రసాద్, రామవరం

క: రామవరం పదో వార్డులో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి, మురికి నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం నెలకొన్న నేపథ్యంలో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం.

స : పట్టణంలో స్వైర విహారం చేస్తున్న కుక్కలను పట్టించాలి

– దీపిక, కొత్తగూడెం

క: కొత్తగూడెం పట్టణంలోని వీధి కుక్కలను పట్టించేందుకు ఆనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ వారు వార్డుల్లో తిరుగుతున్నారు. వాటిని పట్టుకుని ఏబీసీ సెంటర్‌లో వ్యాక్సినేషన్ చేసి, మళ్లీ అవి ఉన్న ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. ప్రస్తుతం వర్షకాలం అయినందున ఎక్కువ సంఖ్యలో కుక్కలకు వ్యాక్సినేషన్ చేయిస్తాం.

స : డ్రెయినేజీల నిర్మాణం త్వరగా చేపట్టండి

– లగడపాటి రమేష్, లక్ష్మీదేవిపల్లి

క: మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగునీరు లక్ష్మీదేవిపల్లిలోని ఇందిరానగర్, శ్రీనగర్ కాలనీల్లోకి వస్తున్నందున రూ.50 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించాం. దీంతో పాటు సాయినగర్, ఇందిరానగర్ కాలనీల్లో రెండు డ్రెయినేజీలు కావాలని స్థానికులు అడుగుతున్న నేపథ్యంలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

స : జంతు ప్రేమికులతో సమావేశం నిర్వహించాలి

– రఘుమాచారి, కొత్తగూడెం

క: పట్టణ పరిధిలోని వీధి కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తీసుకెళ్లి వ్యాక్సినేషన్ చేయిస్తున్నాం. కుక్కలకు సంబంధించిన విషయాలను చర్చించేందుకు జంతు ప్రేమికులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం.

స : ఏబీసీ సెంటర్‌లోకి ఎవరూ రాకుండా ఇబ్బంది కలిగిస్తున్నారు

– రుద్రమదేవి, జంతుప్రేమికులు, హైదరాబాద్

క: కొత్తగూడెం ఏబీసీ సెంటర్‌లోకి అందరికీ అనుమతి ఉంటుంది. లోపలికి రాకుండా ఎవరూ అడ్డుకోవడం లేదు. అలాంటిదేమైనా ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయండి. సెంటర్‌లోకి తీసుకెళ్లిన కుక్కలకు వ్యాక్సినేషన్ చేసి మళ్లీ బయటకు వదిలేస్తున్నాం.

స : డ్రెయినేజీ కారణంగా ప్రహరీ పడిపోయేలా ఉంది

– అశోక్‌బాబు, గాజులరాజంబస్తీ

క: గాజులరాజంబస్తీలో ప్రహరీలకు ఆనుకుని డ్రెయినేజీ ఉండడంతో గోడలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ నేపథ్యంలో వాటిని పరిశీలించి నూతన డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

స : కిన్నెరసాని నీరు బురదమయంగా సరఫరా అవుతోంది

– రాజేష్, గాజులరాజంబస్తీ

క: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున కిన్నెరసాని ప్రాజెక్టు నీరంతా బురదమయం అయింది. దీంతో ప్రాజెక్టు నుంచి ఇల్లెందు ఫిల్టర్‌బెడ్‌లోకి వచ్చే నీటిని శుభ్రం చేసి పట్టణంలోకి వదులుతున్నాం. ఫిల్టర్ చేసిన నీరు పట్టణంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

స : న్యూగొల్లగూడెంలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు తొలగించాలి

– అన్వేష్, న్యూగొల్లగూడెం

క: న్యూగొల్లగూడెం ఏరియాలోని ఖాళీ స్థలాల్లో ఉన్న మొక్కలను వెంటనే సిబ్బందిచే తొలగించే పనులు చేపడతాం. పట్టణ ప్రజలంతా వారికి సంబంధించిన ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపట్టాలి. ఈ మొక్కలతో దోమలు వచ్చి విష జ్వరాలకు కారణమవుతున్నాయి.

ప్రణాళికాయుతంగా ప్రయత్నిస్తాం

- భగీరథ నీరు సక్రమంగా అందేలా చూస్తాం
- ఖాళీ స్థలాలు శుభ్రం చేయించేలా యజమానులకు నోటీసులు
- 'సాక్షి ఫోన్ ఇన్'లో ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ యాదగిరి

సాక్షి ఫోన్ ఇన్

ఇల్లెందు: ఇల్లెందులో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి అన్నారు. పట్టణంలో కొన్ని రోజులుగా కోతులు, కుక్కలు సంచారం పెరిగిందని, కోతులను పట్టించడంతో పాటు కుక్కల బెడద తగ్గించేందుకు పశుసంవర్థక శాఖకు సమాచారం అందిస్తామని తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన పలు సమస్యలకు ఆయన సమాధానం చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ అంకుషావలి తదితరులు పాల్గొన్నారు.

సమస్య : ఇల్లెందులపాడు ఏరియాలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ చేయటం లేదు. బ్లీచింగ్ చల్లించడం లేదు. – బి.నరహరి, ఇల్లెందు

కమిషనర్ : కోతులు పట్టిస్తాం, కుక్కలకు వేసవిలో శస్త్ర చికిత్స చేయించాం. దోమలు, ఈగల నివారణకు స్ప్రే చేస్తాం. రహదారిలో క్లీన్ అండ్ గ్రీన్ చేయిస్తాం.

స : కొత్త కాలనీలోని ఖాళీ స్థలాల్లో చెత్త పెరిగింది. ఈగలు, దోమలు వృద్ధి చెందాయి. పాములు, తేళ్లు ఉంటున్నాయి. – హరికృష్ణ, కొత్త కాలనీ

క : ఖాళీ స్థలాలు ఉన్న వారికి నోటీసులు ఇచ్చి చెత్త తొలిగించేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు ముగియగానే బ్లీచింగ్, ఫాగింగ్ చేపడతాం.

స : భగీరథ నీరు రాడటం లేదు. రామాలయం గల్లీలో సైడ్ కాలువ లేక దుర్వాసన వెదజల్లుతోంది.

– ఊట్ల రాజేష్, 17వ వార్డు, ఇల్లెందు.

క : తక్షణమే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. డ్రెయిన్లు శుభ్రం చేయడంతో పాటు లేనిచోట నిర్మిస్తాం.



మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి

స : ఎల్‌బీఎస్ నగర్‌లో రోడ్డుపై ఇంటి మెట్లు కట్టి గల్లీని ఇరుకుగా మార్చారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

– కస్తూరి సృజన్, ఎల్‌బీఎస్ నగర్

క : సంబంధిత అధికారులను పరిశీలనకు పంపించి తగు చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై ఉన్న నిర్మాణాలను తొలగిస్తాం.

స : చెట్లు పెరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయంగా మారింది. దోమలున్నాయి, ఫాగింగ్ చేయండి.

– ఉమారాణి, మెయిన్‌రోడ్ ఏరియా,
– షబానా, ఎల్‌బీఎస్ నగర్, ఇల్లెందు

క : చెట్లు తొలిగించేలా చర్యలు తీసుకుంటున్నాం. పెరిగిన చెట్లు ట్రిమ్మింగ్ చేపట్టాం. ఫాగింగ్ చేపట్టాం. బ్లీచింగ్ పౌడర్ కౌన్సిలర్లకు అందజేశాం.

స : సత్యనారాయణపురం ఎస్టీ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. రోడ్లు బురదమయంగా ఉన్నాయి. – రమేష్, 1వ వార్డు

క : మున్సిపల్ శానిటేషన్ వర్కర్లను పంపించి క్లీన్ చేయిస్తాం, చెత్త తొలిగిస్తాం.

స : 19వ వార్డులో రైలు కట్టల వెంట చెత్త పెరిగింది. జేసీబీలు వచ్చినా పూర్తిగా తొలిగించలేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి.

– శశికుమార్, 19వ వార్డు.

క : మళ్లీ జేసీబీని పంపించి క్లీన్ చేయిస్తాం. బ్లీచింగ్ చల్లిస్తాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

స : వీధిలైట్లు వెలగడం లేదు. తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయి. రాత్రివేళ బయటకు రాలేకపోతున్నాం.

– సతీష్‌ఖండేల్‌వాల్, ఇల్లెందు,
దీప్తిసింగ్, 8వ వార్డు

క : తక్షణమే విద్యుత్ సిబ్బందిని పంపించి చర్య తీసుకుంటాం. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. లైట్లు లేకుంటే ఏర్పాటు చేస్తాం.

స : గత నెల రోజులుగా సింగరేణి నీరు రావడం లేదు, అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

– హరిప్రసాద్ యాదవ్, స్టేషన్ బస్తీ

క : సింగరేణి నీరు వచ్చేలా సిబ్బందితో తనిఖీ చేయించి ఆ సంస్థకు ఫిర్యాదు చేస్తాం. లైట్లు ఏర్పాటుకు తక్షణం చర్యలు తీసుకుంటాం.

స : భగీరథ రోడ్డు కట్ చేసి వదిలేశారు. పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. లైట్లు వెలుగడం లేదు.

– మీర్జా, 4వ వార్డు, ఇల్లెందు

క : భగీరథ అధికారులకు సమాచారం అందించి కట్ చేసిన రోడ్లు వేయిస్తాం. లైట్లు ఏర్పాటు చేస్తాం

తక్షణమే వార్డుల్లో సమస్యల పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని పలు వార్డులు, లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ బి.యాదగిరితో కలిసి మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించిన వెంటనే ఆయా వార్డుల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలపై ఆరా తీశారు. 1,15,18 వార్డుల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలుస్తుండటాన్ని గమనించారు. వారి వెంట కౌన్సిలర్లు కటకం పద్మావతి, సయ్యద్ ఆజమ్, చీమల సుజాత, పాబోలు స్వాతి, మేనేజర్ అంకుషావలి, టీపీఎస్ సతీష్, ఎస్‌ఐ రాధాకృష్ణ ఉన్నారు.

గోదావరి ఉరకలు



భద్రాచలం వద్ద గోదావరి నదిలో వరద ప్రవాహం

- భద్రాచలంలో స్నానఘట్టాల వద్దకు చేరుకున్న వరద
- వాగులు పొంగటంతో నిలిచిన రాకపోకలు
- సహాయ, సమాచారం కోసం కంట్రోల్ రూంల ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలంలో గోదావరి నది ఉరకలు వేస్తోంది. ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోంది. ఈ ఏడాది తొలిసారిగా 40 అడుగుల సమీపంలోకి నీటిమట్టం చేరింది. తాలిపేరు వాగు ఉధృతంగా ఉండటంతోపాటు వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉండటంతో గోదావరి వరద పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద 43 అడుగులు దాటితే మొదటి, 48 అడుగులకు రెండో, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరికలను జారీ చేస్తారు. కాగా వరద నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసింది.

క్రమంగా పెరుగుతున్న గోదావరి

తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలోకి వరద వస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వరదతో తాలిపేరు ప్రాజెక్ట్ నిండగా, శనివారం ఉదయం 25 గేట్లకు గాను 20 గేట్లను తెరిచి 66,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఇంకా ఇన్‌ఫ్లో పెరగటంతో 25 గేట్లనూ తెరిచి 1,27,717 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఉదయం 6 గంటలకు 30 అడుగులుగా నమోదైంది. ఉదయం 10గంటలకు 32.02, మధ్యాహ్నం 12 గంటలకు 33.08 అడుగులకు పెరిగింది. అనంతరం స్వల్పంగా పెరుగుతూ సాయంత్రం 5గంటలకు 35.01 అడుగులకు చేరింది. 5,96,805 క్యూసెక్కుల నీరును దిగువకు వెళ్తోంది. రాత్రి 11 గంటలకు 35.9 అడుగులుగా నమోదయింది. స్నానఘాట్‌ల వద్దకు నీరు చేరుకోవడంతో భక్తుల పుణ్యస్నానాలను నిలిపివేస్తూ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను, లాంచీలను సిద్ధంగా ఉంచారు.



సహాయానికి సిద్ధంగా ఉంచిన లాంచీలు

ఏజెన్సీలో నిలిచిపోయిన రాకపోకలు

ఎడతెగని వర్షాలతో గోదావరి పెరగటంతోపాటు గ్రామాల్లో కుంటలు, చెరువుల అలుగులు నిండి ప్రవహించాయి. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ప్రధాన రహదారులపైకి నీరు చేరటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి, బైరాగుల పాడు గ్రామాల నడుమ, పెద్దనల్లబల్లి, కే.లక్ష్మీపురం గ్రామాల మధ్య రవాణా స్తంభించింది. వాగులు పొంగడంతో చర్ల మండల కేంద్రం నుంచి లింగాపురం, గొంపల్లి, కొత్తపల్లి, మొగళ్లపల్లి గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.

కంట్రోల్ రూంలు..

గోదావరి నీటి ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతుండటంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల వివరాలు తెలిపేందుకు భద్రాచలం ఐటీడీఏలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో ముంపునకు గురైన, ఇతర వరద సహాయ కార్యక్రమాల కోసం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 79952 68352కు ఫోన్ చేసి చెప్పవచ్చని పీఓ రాహుల్ ప్రకటనలో తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743-232444, 79812 19425 వరదల కంట్రోల్ రూమ్ నంబర్లలో కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. గోదావరి, చెరువు ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీరికి సహాయ కార్యక్రమాలను అందచేసేందుకు అధికారులు, సిబ్బంది సదా సిద్ధంగా ఉండాలని సూచించారు.



ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో సిబ్బంది

ముమ్మరంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ..

పనులను పర్యవేక్షించిన ట్రాన్స్‌కో ఎస్‌ఈ



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉప్పొంగి విద్యుత్ శాఖకు అపార నష్టం వాటిల్లింది. దీంతో అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. శనివారం మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు, బచ్చువారిగూడెం, కోయ రంగాపురం, గాండ్లగూడెం, కావడిగుండ్ల, కన్నాయిగూడెంతోపాటు పలు గ్రామాల్లో ట్రాన్స్‌కో ఎస్‌ఈ బీకాం సింగ్ సీంగ్ పర్యటించి, పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు వరద ప్రభావిత గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం అర్ధ రాత్రే నుంచే విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనే అశ్వారావుపేట, ఖమ్మం నుంచి రప్పించిన 70 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి శనివారం రాత్రి వరకు తెగి పడిన విద్యుత్ వైర్లను 10 కిలోమీటర్ల దాకా, 100 కరెంట్ స్తంభాలు, 20 ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించి, వరద ప్రభావిత గ్రామాలకు కరెంట్ సరఫరా చేసినట్లు వివరించారు. ఈ పనులను మరింత వేగవంతంగా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈఈ నందయ్య, ఏడీఈలు బీ వెంకటేశ్వర్లు, పురుషోత్తం, ఏఈఈలు, సబ్ ఇంజనీర్లు, లైన్‌మెన్‌లు, ప్రైవేటు వర్కర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారుడికి చేయూతనివ్వండి



సాధన చేస్తున్న వంశీ

భద్రాచలంటౌన్: అంతర్జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ఓ యువకుడు ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడేనికి చెందిన మోడెం వంశీ భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు. జాతీయస్థాయిలో రాణించి జూనియర్ విభాగంలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. యూరప్‌లోని మాల్టా దేశంలో పోటీలు జరగనుండగా, రాకపోకలకు ఖర్చు నిమిత్తం రూ. 2.10 లక్షలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సి ఉంది. వంశీ ప్రతిభను గుర్తించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఐటీడీఏ ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించగా, ఇంకా రూ.1.10 లక్షలు కావాల్సి ఉంది. దాతలు స్పందించి ఆర్థికసాయం అందించాలని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ కోరుతున్నారు. మోడెం వంశీ ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 80745 81584 సహాయం అందించాలని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలతో సమావేశమైన అధికారులు

గుండాల: నిరుపేద మహిళలు ఆర్థికంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా స్త్రీ నిధి రుణాలు ఇస్తోందని ఫైనాన్సియల్ ఇంక్లూజన్ రాష్ట్ర కో ఆర్డి నేటర్ మధుసూదన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి అన్నారు. ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. స్థానిక బ్యాంకుల్లో మహిళలు కచ్చితంగా అకౌంట్లు తెరుచుకోవాలని , ఇన్సూరెన్సు కూడా కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ వారం గ్రూపు సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు కావాల్సిన వివిధ జీవనోపాధుల రూపకల్పనకు ఖమ్మం ఆర్‌ఎస్‌ఈటీఐలో శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో నవనీత్, ఏపీఎం వినోద్‌క్రాంతి, సీసీ కోటేశ్వరావు, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో రేంజర్ల బదిలీ

పాల్వంచరూరల్: అటవీశాఖలో బదిలీల ప్రక్రియ ముగిసింది. మల్టీజోన్ 1 పరిధిలోని రేంజర్ల బదిలీలకు నిర్మల్ జిల్లా కేంద్రంలో సీసీఎఫ్ సమక్షాన శుక్రవారం కౌన్సెలింగ్ జరిగింది. ఈ సందర్భంగా పాల్వంచ వన్యమృగాల సంరక్షణ విభాగం(వైల్డ్‌లైఫ్) డివిజన్ పరిధి యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావును రామవరానికి, ఖమ్మంలో విధులు నిర్వర్తిస్తున్న కవితమాధురిని యానంబైల్‌కు బదిలీ చేశారు. అలాగే, చాతకొండ రేంజర్ శ్రీనివాసరెడ్డి మధిరకు, దుమ్ముగూడెం నుంచి కనకమ్మను చాతకొండకు, ఆళ్లపల్లి రేంజర్ నర్సింహారావు గుండాలకు, భూపాలపల్లి నుంచి కిరణ్‌కుమార్ ఆళ్లపల్లికి బదిలీ అయ్యారు. ఇక పాల్వంచ రేంజర్ అనిల్‌కుమార్‌ను ఆసిఫాబాద్‌లోని పెంచికల్‌పేట్‌కు, కొత్తగూడెం నుంచి సురేష్‌ను పాల్వంచకు బదిలీ చేయగా, అశ్వారావుపేటలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న మురళికి అక్కడే రెగ్యులర్ పోస్టింగ్ కేటాయించారు.

మార్కెట్ అధికారుల బదిలీ

ఖమ్మంవ్యవసాయం: మార్కెటింగ్‌శాఖ, వ్యవసా య మార్కెట్లలో పనిచేసే పలువురు అధికారులు బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీంను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. అయితే, ప్రస్తుతం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఇన్‌చార్జ్ అధికారిగా పనిచేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శి బి.బజార్‌ను ఏన్కూరు మార్కెట్‌కు, ఏన్కూరు మార్కెట్‌లో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును చర్ల, చర్ల మార్కెట్ నుంచి ఘనీని హుజూర్‌నగర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. అలాగే, కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌లో పనిచేస్తున్న సృజన్‌ను ఖమ్మంకు బదిలీ చేయగా ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. కాగా, ఖమ్మం మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి నియామకంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

మత్స్యశాఖలో..

ఖమ్మం జిల్లాలోని వైరా సీడ్‌ఫామ్ ఫిషర్‌మెన్ అక్బర్‌ను ఖమ్మం సారథినగర్‌లోని మత్స్యాభివృద్ధి కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం కార్యాలయం వాచ్‌మెన్ నర్సింహారావు వైరా సీడ్ ఫామ్‌కు బదిలీ అయ్యారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్లు బదిలీ

పాల్వంచరూరల్: పాల్వంచ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శనివారం సీడీపీఓతోపాటు ఐదుగురు అంగన్‌వాడీ సీనియర్ సూపర్‌వైజర్లు బదిలీఅయ్యారు. సీడీపీఓ బూర్గంపాడుకు బదిలీకాగా ఆమె స్థానంలో ఇల్లెందు సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఇక్కడకు వచ్చారు. ఉల్వనూరు సెక్టార్ సూపర్‌వైజర్ వసంతరాణి, పాండురంగాపురం సూపర్‌వైజర్ రత్నకుమారి, జగన్నాథపురం సూపర్‌వైజర్ అనసూర్య, హేమచంద్రాపురం సూపర్‌వైజర్ అనురాధతోపాటు లక్ష్మీదేవిపల్లి సూపర్‌వైజర్ బదిలీ అయ్యారు. కాగా బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు రావాల్సి ఉందని సీడీపీఓ రేవతి తెలిపారు.

ఉపాధి కల్పనాధికారిగా శ్రీరాం



శ్రీరాం

కొత్తగూడెంటౌన్: జిల్లా ఉపాధి కల్పనాధికారిగా కొండపల్లి శ్రీరాం నియమితులయ్యారు. ఖమ్మం జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న శ్రీరాంను ఇక్కడకు బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వి.విజేతను ఖమ్మంలోని మహిళా ప్రాంగణం ప్రాజెక్ట్ అధికారిగా బదిలీ చేశారు. అయితే, ఏడాది కాలంగా విజేత జిల్లా సంక్షేమశాఖ అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ పోస్టు మార్పుపై మాత్రం ఎలాంటి ఆదేశాలు రాలేదని ఐసీడీఎస్ అధికారులు వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

వరద బాధితులకు నష్టపరిహారం

- రూ. 3.94 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- వివరాలు వెల్లడించిన ఆర్డీఓ మధు



వరద బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధు

అశ్వారావుపేటరూరల్: వరద బాధితులకు నష్టపరిహారం మంజూరైందని ఆర్డీఓ డి.మధు తెలిపారు. శనివారం ఆయన అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లో పర్యటించి వరద బాధిత కుటుంబాలతో మాట్లాడారు. గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టు గండి ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పెదవాగు ప్రాజెక్ట్‌కు గండి పడి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందన్నారు. వరదలతో నష్టపోయిన గృహాలను గుర్తించామని తెలిపారు. 44 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, 21 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, మూడు కచ్చా ఇళ్లు, 42 పశువుల కొట్టాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పూర్తిగా దెబ్బతిన్న గుడిసెకు రూ.4,100, పాక్షికంగా దెబ్బతిన్న పక్కా గృహానికి 5,200, కచ్చా ఇంటికి రూ. 3,200, పశువుల కొట్టానికి రూ. 2,100 చొప్పున ప్రభుత్వం మొత్తం రూ. 3,94,700 నిధులు మంజూరు చేసిందని ఆర్డీఓ తెలిపారు. వర్షాలు, వాగు ఉప్పొంగి దెబ్బతిన్న పంటలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నామన్నారు. సర్వే వివరాలు అందిన తర్వాత బాధితుల వివరాలు, నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఆర్ఐ కృష్ణయ్య, గ్రామస్తులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

దమ్మపేట: మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి శనివారం పరిశీలించారు. దమ్మపేట, మందలపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య, డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణారావు, ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ రామారావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వరకు ఐటీఐ ప్రవేశ గడువు

బూర్గంపాడు: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో రెండో విడత ప్రవేశ గడువు ఆదివారంతో ముగియనుందని కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 2024 ఆగస్టు 1వ తేదీ నాటికి 14 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

రాజీవ్‌సాగర్ పైపులు మాయం

టేకులపల్లి: రాజీవ్ సాగర్ పైపులు మాయమైన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని కుంటల్ల – బేతంపూడి మధ్య వాగు సమీపంలో మూడు భారీ ఇనుప పైపులు ఉండేవి. శుక్రవారం వరకు మూడు పైపులు ఉండగా, శనివారం మాత్రం రెండు పైపులు కనిపించ లేదని, వాటికి సంబంధించిన కొన్ని ముక్కలు ఉన్నాయని, గ్రామస్తులు తెలిపారు. రాత్రికి రాత్రే రెండు పైపులు మాయం కావడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన చాపర్ల వేణు మురళి(32) ఇంట్లో నీళ్లు లేవని, గ్రామంలోని తాగునీటి పథకానికి సంబంధించిన మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు గుమ్మడవల్లి పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అశ్వారావుపేట సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు మూడేళ్ల కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు కాగా, కరెంట్ షాక్‌తో మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు.

బదిలీ ప్రక్రియలో అన్యాయం

హైకోర్టును ఆశ్రయించిన సూపరింటెండెంట్

ఇల్లెందురూరల్: పంచాయతీరాజ్ శాఖ బదిలీల ప్రక్రియలో తనకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ ఇల్లెందు మండల పరిషత్తు కార్యాలయ సూపరింటెండెంట్ ముక్తవరపు శ్రీకాంత్ హైకోర్టును ఆశ్రయించారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. జీవోఎంఎస్ నెం.80 ప్రకారం జోన్-4 పరిధిలో పనిచేసే పంచాయతీరాజ్ ఉద్యోగుల బదిలీలు కమిషనరేట్ నుంచి జరగాలని తెలిపారు. కానీ బదిలీ ప్రక్రియకు ముందు రోజు జీవోఆర్‌టీ నెం.388 తీసుకొచ్చారని, దీని ప్రకారం ఏ జిల్లాలో పనిచేసే ఉద్యోగులు ఆ జిల్లాలోనే బదిలీకి ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఉందని పేర్కొన్నారు. తనకు జరిగిన అన్యాయంపై పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 15న తాను బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరు కాకుండా హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. స్పందించిన కోర్టు ప్రభుత్వ జీఓలను పరిశీలించి తన ఆవేదన సమ్మతమేనని పేర్కొంటూ జీవో ఎంఎస్ నెం.80 పరిధిలో తనను బదిలీ చేయాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. బదిలీ ప్రక్రియలో భాగంగా నిబంధనలు, జీవోఎంఎస్ 80కి అనుగుణంగా తాను తన సొంత జిల్లాకు వెళ్లేందుకే కోర్టును ఆశ్రయించనని చెప్పారు. కోర్టు ఉత్తర్వులను ఖమ్మం జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేశానని తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆటో

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఆగి ఉన్న లారీని ఓ ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదం శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. మరమ్మతులకు గురైన లారీని డ్రైవర్ రోడ్డుపై నిలపగా ఆటో డ్రైవర్ అతి వేగంతో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలుకాగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

108 వాహనంలో ప్రసవం



తల్లీబిడ్డలతో వైద్యారోగ్య సిబ్బంది

జూలూరుపాడు: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన ఓ గర్భిణి శనివారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గ్రామానికి చెందిన గర్భిణి దొడ్డా మానసకు పురిటి నొప్పులు వస్తుండటంతో ఆశా కార్యకర్త విజయ, కుటుంబీకులు 108 వాహనంలో జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆశా కార్యకర్త విజయ, ఈఎంటీ రవి, పైలట్ శ్రీనివాస్ సేవలందించి గర్భిణికి కాన్పు చేశారు. మానస మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం ఆస్పత్రికి తరలించగా వైద్యసిబ్బంది వైద్యసేవలు అందించారు.

ఏపీలో అపహరించి.. మణుగూరులో చిక్కి..

చోరీ చేసిన మిర్చి లారీని భీమడోలు పోలీసులకు అప్పగింత



స్వాధీనం చేసుకున్న మిర్చి లారీ


మణుగూరు టౌన్: గుంటూరు నుంచి బిహార్‌లోని పట్నా వెళ్లాల్సిన మిర్చి లారీ లోడును నలుగురు వ్యక్తులు దొంగిలించి కమలాపురంలో ఉంచగా, శనివారం సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రంజిత్‌లు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నలుగురు వ్యక్తులు గుంటూరు నుంచి పట్నా వెళ్లాల్సిన 15 టన్నుల మిర్చి లారీని ఏలూరు బైపాస్ వద్ద అపహరించి, తీసుకొచ్చి శనివారం ఉదయం మణుగూరు మున్సిపాలిటీలోని కమలాపురానికి చేర్చారు. నలుగురు వ్యక్తులు కారులోనే ఉంటూ అనుమానాస్పదంగా వ్యవహరించగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా.. ప్రకాశం జిల్లా, కృష్ణ, కోనసీమ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి కారులో లారీని గుంటూరు నుంచి వెంబడిస్తూ దొంగిలించినట్లు అంగీకరించారు. దీంతో లారీని స్వాధీనం చేసుకున్నారు. కాగా లారీ చోరీపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారమే కేసు నమోదు కావడంతో నిందితులను, కారును, మిర్చి లారీని భీమడోలు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. పట్టుకున్న మిర్చి విలువ రూ. 13 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్: పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను శనివారం అరెస్ట్‌చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మున్సిపాలిటీ పరిధి కుంటినాగులగూడెంలోని కోళ్లఫారంలో పేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడి చేశారు. రూ.15,300 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఇందులో ఇద్దరు స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు వ్యాపారులు ఉన్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ.రాఘవయ్య తెలిపారు.

కిన్నెరసాని మూడు గేట్లు ఎత్తివేత

12 వేల క్యూసెక్కుల నీటి విడుదల



కిన్నెరసాని నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్ట్‌లోకి 5,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో శనివారం నీటి మట్టం 402.80 అడుగులకు పెరిగింది. దీంతో మూడు గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వృద్ధురాలి అవయవదానం

కొత్తగూడెంఅర్బన్: చనిపోయి కూడా ఆదర్శంగా నిలిచిందో వృద్ధురాలు. గరీబ్‌పేటకు చెందిన పెద్ది కొమరమ్మ మేదరబస్తీలోని తన కుతూరు ఇంటికి వచ్చింది. గత మంగళవారం సింగరేణి ఆస్పత్రిలో మందుల కోసం వెళ్తున్న క్రమంలో గణేష్‌టెంపుల్ ఏరియాలో రామవరానికి చెందిన ఆటో డ్రైవర్ టేకుల రమేష్ ఆటోతో ఢీకొట్టాడు. దీంతో కొమరమ్మ తలకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కొమరమ్మ బ్రెయిన్ డెడ్ కావడంతో శనివారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కిడ్నీలు, లివర్‌ను హైదరాబాద్ ఆస్పత్రిలో దానం చేసి ఆదర్శంగా నిలిచారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

దుమ్ముగూడెం : మండలంలోని సున్నంబట్టి గ్రామం వద్ద గోదావరి నదిలో శనివారం ఓ మృతదేహం లభ్యమైంది. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామానికి చెందిన బాణారి రాజు(45) బాణారి రాజు రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి గోదావరి వరదలో గల్లంతయ్యాడు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా చేపల వేటకు వెళ్లిన సున్నంబట్టి గ్రామానికి చెందిన మత్స్యకారుడు యంబడి అర్జునరావు గోదావరి నదిలో కొట్టుకువస్తున్న మృతదేహాన్ని చూసి ఒడ్డుకు చేర్చాడు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెంకటాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెంకటాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్

మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం

ఏపీలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం

- ఢిల్లీ ధర్నా తర్వాత పార్లమెంటు ఉభయసభల్లోనూ గళమెత్తాలి.. రాష్ట్రంలోని ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. అందుకే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నాం
- అదే విషయంపై పార్లమెంటులో నినదించాలి.. అలా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలి
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశానిర్దేశం



"ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోరాటంలో మనతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని పోదాం. ధర్నాలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్దాం. రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతోందో వివరిద్దాం. ధర్నా అనంతరం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వాలి. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై ఉభయ సభల్లో గట్టిగా మాట్లాడాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దురాగతాలను అందరి దృష్టికి తీసుకెళ్లాలి.

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 'ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

హత్యలు.. హత్యాయత్నాలు.. విధ్వంసాలు

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. అంతకు ముందు మల్లికా గార్గ్ జిల్లా ఎస్పీగా ఉన్నారు. ఆమె సమర్థురాలు. అందుకే ఆమెను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి.

ఎంపీపైనా యథేచ్ఛగా దాడి

మరోవైపు తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దగ్ధం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా?

రాష్ట్రంలో 15 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రస్థానం సాగుతోంది. చంద్రబాబు ఆశించినట్టుగా వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరు. ఎవరు అధికారంలో ఉన్నా ఇలాంటి దాడులు మంచివి కావు. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీ మీద దాడులు చేయడం ధర్మమా? ఇలాగైతే ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుంది? గత ఎన్నికల్లో మనం 86 శాతం సీట్లను గెలిచాం. అయినా ఇలాంటి ఘటనలు జరగలేదు. దాడులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రజలందరినీ సమానంగా చూశాం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ఎవరూ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేయకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన. అందుకే దగ్గరుండి విధ్వంసకాండను ప్రోత్సహిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలి. కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి.

హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాఠశాలల పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వర కు కొనసాగుతుండగా.. ఈ సమయాన్ని అరగంట ముందుకు జరిపింది. ఇకపై ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి. కాగా, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రస్తుతం కొనసాగుతున్న సమయాలను యథావిధిగా ఉంచిన ప్రభుత్వం.. ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో హైదరాబాద్ జంటనగరాల్లో కూడా ప్రస్తుతం ఉన్నట్టుగానే ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులను, ప్రాంతీయ సంయుక్త సంచాలకులను ఆదేశించారు.

31 వరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

బదిలీల షెడ్యూల్ పొడిగింపు.. ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 3వ తేదీన ఇచ్చిన జీవో ప్రకారం శనివారంతో బదిలీల షెడ్యూల్ ముగియాల్సి ఉండగా.. ఈనెల 31 వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాని నేపథ్యంలో.. గడువును పొడిగిస్తున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివా రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి సాధారణ బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దాశరథి పురస్కారానికి జూకంటి జగన్నాథం



సాక్షి, హైదరాబాద్: కవి, కథకుడు జూకంటి జగన్నాథంకు రాష్ట్రప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య పురస్కారం ప్రకటించింది. ఈమేరకు శనివారం రాత్రి ఉత్తర్వు జారీ చేసింది. పురస్కార కమిటీ రెండు రోజుల క్రితం భేటీ అయి జూకంటి జగన్నాథం పేరును సిఫారసు చేసింది. ఆయన పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. త్వరలో జూకంటికి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను రూ.లక్షా వేయి నూట పదహార్లు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నారు.

అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరిగేలా కార్యాచరణ

- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ప్రకృతి వనరులను జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఐటీ ఉద్యోగులు ఆయా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపేలా వాటిని అభివృద్ధి చేసే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శనివారం ఆయన పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి బడ్జెట్ సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగురోడ్డు పరిసరాలు, జలాశయాలు, అడవుల వంటి ప్రాంతాలను పర్యాటకులకు స్వర్గధామంలా రూపొందించే అవకాశం ఉందని, ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. సాంస్కృతిక సారథి కళాకారుల కార్యక్రమాలపై ఆరా తీశారు. సమాజాభివృద్ధికి వారి సేవలను సమగ్రంగా వినియోగించుకునే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని క్రీడా మైదానాలను మెరుగుపరిచి, సంవత్సరం పొడవునా వాటిలో యాక్టివిటీ ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు వాటిల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని, అవి ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు.

సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి రిజ్వీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి శ్రీధర్, హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.

ఆర్‌సీఓల స్థానంలో జోనల్ ఆఫీసర్లు

- ఖమ్మం జోనల్ ఆఫీసర్‌గా స్వరూపరాణి

నేలకొండపల్లి: ఎస్సీ గురుకులాల పర్యవేక్షణకు ఇన్నాళ్లు కొనసాగుతున్న రీజినల్ కోఆర్డినేటర్ల (ఆర్‌సీఓ)ల స్థానంలో జోనల్ ఆఫీసర్లను నియమిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం ఆర్‌సీఓగా ఉన్న ప్రత్యూషను బదిలీ చేస్తూ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ వైస్ చైర్మన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను కరీంనగర్ బదిలీ చేయడంతో పాటు ఖమ్మం గురుకుల పాఠశాలల జోనల్ ఆఫీసర్‌గా కరీంనగర్ ఆర్‌సీఓగా ఉన్న కె.స్వరూపారాణిని నియమించారు. కాగా, స్వరూపారాణి గతంలో నేలకొండపల్లి, ఖమ్మం అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించారు.

స్తంభాన్నే తలదన్నేలా!

వేపకుంట్లలో 14 అడుగులు పెరిగిన జొన్నచెట్టు



రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో మిట్టకోలు వేలాద్రి ఇంటి ఆవరణలో జొన్న మొక్క 14 అడుగుల మేర ఎత్తు పెరిగింది. పక్కనే విద్యుత్ స్తంభానికి మించి చెట్టు పెరగడంతో చెట్టును స్థానికులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఈ చెట్టు ఏడాదిన్నరగా పెరుగుతూ ప్రస్తుతం స్తంభాన్ని దాటేసిందని వేలాద్రి తెలిపారు.

– రఘునాథపాలెం

రైతులారా.. పంటలు జాగ్రత్త

- ఎడతెరిపి లేని వర్షంతో చేలలో నిలిచిన నీరు
- చీడపీడలు సోకకుండా అప్రమత్తత అవసరం



కొణిజర్ల సమీపాన పత్తి చేనులో నిలిచిన నీరు

మధిర: వారం రోజులుగా జిల్లా అంతటా ఎడతెరిని లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యాన కంది, పత్తి, మినుము, పెసర తదితర పంట చేన్లలో నీరు నిలిచింది. ఈ మేరకు పోషక పదార్థాల లోపం ఏర్పడి చీడలు, తెగుళ్లు, కలుపు సమస్య పెరిగే అవకాశముంది. ఇందులో భాగంగా రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్ వెల్లడించారు.

వరి

వరి నారుమడిలో కలుపు యాజమాన్యం ఆటంకంగా మారుతుంది. బిస్ పైరిబాక్ సోడియం మందు 0.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి విత్తిన 8–10 రోజుల్లో పిచికారీ చేసుకోవాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు ఉంటే విత్తిన 15–20 రోజులకు సైహలోఫాప్–పీ–బ్యూటైల్ మందు 1.5 మి.లీ.ను లీటర్ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అలాగే, అధిక వర్షాలతో ఇనుప ధాతు లోపాన్ని గమనిస్తే పంట, మొక్క వయసు ఎదుగుదల ఆధారంగా 2–5 గ్రాములు అన్నభేది, 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట నారుమడికి 200 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు కేజీని ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. ఇక జింకు లోపం గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

మినుము, పెసర

అధిక వర్షాలతో సాధారణంగా శాఖీయ పెరుగుదల అధికంగా ఉంటుంది. తద్వారా ఆకురొట్ట ఎక్కువగా ఉండి పొగాకు లద్దె పురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఈ మేరకు జిల్లేడు ఆకులు కనబడితే లద్దె పురుగు ఆశించినట్లుగా గుర్తించి వెంటనే గుడ్ల సముదాయం, పిల్ల పురుగులు ఉన్న జిల్లేడు ఆకులను తీసివేయాలి. తొలిదశలో లార్వా నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 3 మి.లీ.ను, ఎదిగిన లార్వా నివారణ కోసం థయోడికార్బ్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మినుము, పెసరలో తామర పురుగులు పైరు లేత దశలో ఎక్కువ ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేయడమే కాకుండా ఆకు ముడత వైరస్‌ను వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్ల దోమ గమనిస్తే నివారణకు 0.2 గ్రాముల ఎసిటోమిప్రిడ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాలతో ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందే అవకాశముంది. దీని నివారణకు కార్బన్‌డిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పెసర పూత దశలో ఉంటే అధిక తేమ వలన పూత రాలిపోయే అవకాశం ఉంటుంది. దీనిని అరికట్టేందుకు ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 4.5 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. అంటే ఎకరానికి 40 మి.లీ. ప్లానోఫిక్స్ సరిపోతుంది.

కంది

అధిక వర్షాలకు అంతర కృషి కష్టమవుతుంది. ఈ నేపథ్యాన కలుపు నివారణకు విత్తిన 20 రోజులకు ఇమజితాఫర్ 300 మి.లీ. ఎకరానికి అంటే 1.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేస్తే గడ్డి, వెడల్పు ఆకు కలుపు నివారించవచ్చు. కంది పంట నీటి ముంపును తట్టుకోలేదని గుర్తించి పంటలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలి. బోదె కాల్వ పద్ధతిలో విత్తుకుని వర్షం నీరు ఇంకిపోయేలా చేయాలి.

పత్తి

అధిక వర్షాలతో నిలిచిన నీటిని తక్షణమే పత్తి చేను నుంచి తీసివేయాలి. పైపాటుగా పోషకాలు అందించేందుకు 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ 13:0:45 లేదా యూరియా 10 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అధిక వర్షాలతో ఎక్కడైనా మొక్కలు ఎండిపోవడం గమనిస్తే అక్కడ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగుభాగం తడిచేలా పిచికారీ చేయాలి. అంతర కృషి చేయలేకపోతే గడ్డి జాతి కలుపు నివారణ కోసం ఎకరానికి క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాపాప్ 250 మి.లీను ఎకరానికి పిచికారీ చేయాలి. గడ్డిజాతి, వెడల్పు ఆకు కలుపు నివారణకు క్విజలోఫాఫ్ ఇథైల్ 400 మి.లీ. తో పాటు పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీను ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. పంట 2 లేదా 4 ఆకుల దశలో పిచికారీ చేస్తే కలుపు నివారణ బాగుంటుంది. పేనుబంక, పచ్చ దోమ తదితర రసం పీల్చే పురుగుల నివారణకు కాండానికి మందుపూత పద్ధతి అవలంబించాలి. కాన్ఫిడార్ లేదా ప్లానికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో 30, 45, 60 రోజుల్లో ఉపయోగించి రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. పచ్చిరొట్టగా జీలుగ వేసిన రైతులు పూత దశలో ఉన్నప్పుడు కలియదున్ని ఎకరాకు 150 కిలోల చొప్పున సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేస్తే జీలుగ తొందరగా మురగడంతో పాటు చివరి దశలో భాస్వరం ఎరువు వేయాల్సిన అవసరం ఉండదు.

డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అభివృద్ధికి కృషి చేస్తున్నామని చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన పాలక వర్గ సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి కోసం వ్యాపారాలను విస్తృతం చేయాల్సిన అవసరముందని చెప్పారు. ఇందులో భాగంగా రైతులకు ప్రయోజనం చేకూరుస్తూనే సంస్థ ఆర్థికాభివృద్ధికి అవసరమైన కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీతో రైతులకు ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్లు పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కంచరపు వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, బిజినెస్ మేనేజర్ కె.సందీప్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎండీ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్వాలను డైరెక్టర్లు సన్మానించారు.

నేడు దమ్మక్క స్మృతి యాత్ర

- గిరి ప్రదక్షణ, ప్రత్యేక పూజలు
- చర్ల మండలంలో గిరిజనుల సమక్షాన రామయ్య కల్యాణం



దమ్మక్క విగ్రహం

భద్రాచలం: అందరి బంధువైన శ్రీసీతారామచంద్ర స్వామి అపర భక్తురాలైన పోకల దమ్మక్కను స్మరించుకుంటూ స్మృతియాత్రను భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించనున్నారు. 2014 నుంచి ఏటా ఆషాఢ మాసంలో దమ్మక్క సేవా యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గిరిజనులను స్వామి పూజలో భాగస్వాములను చేయడం ఈ ఉత్సవ ప్రత్యేకత. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు దమ్మక్క చిత్రపటంతో భద్రగిరి ప్రదక్షణ, టూరిజం హోటల్ వద్ద ఉన్న దమ్మక్క విగ్రహానికి వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. కాగా, గిరిజనులు బేడా మండపంలో స్వామికి పండ్లు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొంటారు. అయితే, ఈసారి చర్ల మండలం ఆర్.కొత్తగూడెంలోని రామాలయంలో గిరిజనుల సమక్షాన కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. ప్రచార రథంలో స్వామి వార్ల ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి కల్యాణం, అన్నదానం జరుపుతున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. అలాగే, ఆదివారం సాయంత్రం భద్రాచలం తాతగుడి సెంటర్ వద్ద ఆలయంలో గోవిందరాజ స్వామి కల్యాణం జరుగుతుందని వెల్లడించారు.

రేపు రామాలయ హుండీ లెక్కింపు

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. చిత్రకూట మండపంలో జరిగే లెక్కింపునకు ఆలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

'రాయల' కుటుంబానికి ఎంపీ పరామర్శ



చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

తిరుమలాయపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం మండలంలోని పిండిప్రోలులో పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన భార్య విమల, కుమారుడు పావెల్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాయల రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స చేయించుకున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీని ఖమ్మంలో ఎంపీ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం ఉన్నారు.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

చర్ల: ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. అంతే కాకుండా అమాయక ఆదివాసీలపై కొనసాగుతున్న ప్రతిఘాతుక కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడించాలని ఆయన శనివారం విడుదల చేసిన లేఖలో వెల్లడించారు. నక్సల్బరీ, సాయుధ రైతాంగ తిరుగుబాటు నుంచి ఇప్పటివరకు నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజాయుద్ధం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో చార్ మజుందార్, కనాయ్ చటర్జీ తదితర నేతలెందరో అమరులయ్యారని, వీరి నేతృత్వంలో విప్లవోద్యమం పురోగమిస్తూ అనేక మంది ప్రజలు ప్రాణాలర్పించారని తెలిపారు. గత ఏడాది 194 మంది ప్రభుత్వ ప్రతిఘాతుక చర్యల్లో బలికాగా, అమరులను స్మరించుకుంటూ ఈ నెల 28న అమరవీరుల సంస్మరణ దినం పాటించడంతో పాటు ఆగస్టు 3 వరకు సంస్మరణ వారోత్సవాలు జరుకోవాలని పిలుపునిచ్చారు.